క్లుప్తంగా

కౌలు రైతులను ఆదుకోండి

కాకినాడ సిటీ: కౌలు రైతు కార్డుతో సంబంధం లేకుండా చనిపోయిన కౌలు రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జేసీ ఎస్.ఇలక్కియకు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, మృతి చెందిన కౌలు రైతుల భార్యలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వితరణ



పారిశుధ్య కార్మికులను సత్కరించి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

బోట్‌క్లబ్: లయన్స్‌క్లబ్ జెమ్స్ చేస్తున్న సేవలు అభినందనీయమని నగరపాలక సంస్థ ఏడీసీ నాగనరసింహారావు అన్నారు. స్థానిక గాంధీనగర్ పార్కులో బుధవారం వంద మంది పారిశుధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు అందించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి, అధ్యక్షుడు పి నాగేశ్వరరావు తదితరులు కార్మికులకు నిత్యావసర వస్తువులు అందజేసి శాలువాతో సత్కరించారు. ఆరోగ్య అధికారి పృథ్వీ చరణ్, క్లబ్ సెక్రటరీ దేవత నరసింహామూర్తి, ట్రెజరర్ వైదాడి రాజు, సభ్యులు ఎస్.మణిబాబు, కిరణ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీవెంకటప్రసాద్ తదితరులు

కాకినాడ సిటీ: జీ–20 ఈవెంట్లలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జాతీయ స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తోందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ చందాల శ్రీవెంకట ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా బుధవారం జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జిల్లా లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మండల స్థాయి పోటీలను నిర్వహించినట్టు తెలిపారు. ఈనెల 28న జిల్లా స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రీవెంకటప్రసాద్ తెలిపారు.

పారిశుధ్య పనుల తనిఖీ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్

కాకినాడ: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు బుధవారం రెండు సర్కిళ్ల పరిధిలోని పేర్రాజు, శ్రీనగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం ఎన్ని సంస్కరణలు అమలు చేస్తున్నా కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్య సేవల్లో ఎలాంటి లోపాలు గుర్తించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా సిబ్బందికి సహకరించి తడి–పొడి చెత్తను వేరువేరుగా అందించాలని కోరారు. ఈ సందర్భంగా 5 డివిజన్లలో పూడిక తీత పనులను ఆయన పర్యవేక్షించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ జిలానీ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా జడ్జి కమలాదేవి
- ఉత్సాహంగా యోగా డే

కాకినాడ లీగల్: శారీరక, మానసిక, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సులువైన సాధనమని మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్‌లో బుధవారం న్యాయమూర్తులు, న్యాయవాదులు యోగా చేశారు. కమలాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ యోగా ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా మెరుగైన సాధనమని, యోగా వల్ల మనసు, శరీరం తేలికవుతాయని, ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత చేకూరుతుందన్నారు. న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వర రావు, జనరల్ సెక్రటరీ చక్కా శ్రీనివాస్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగా గురువులకు సన్మానం

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ వద్ద అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా గురువులు దంగేటి సత్యనారాయణరావు, త్రినాథ్, పి.పార్థసారథిలను అడబాల రత్నప్రసాద్ సన్మానించారు. బుద్దరాజు సత్యనారాయణరాజు, శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో..

సర్పవరం జంక్షన్ వద్ద ట్రస్ట్ ఆస్పత్రి, అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రిలో యోగాసనాల పోటీలు నిర్వహించారు. ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణ, మెడికవర్ ఆస్పత్రి యూనిట్ హెడ్ సిద్ధారెడ్డి తదితరులు యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.



యోగాసనాలు వేస్తున్న వైద్య విద్యార్థులు

కరపలో..

కరప: మండల పరిధిలోని గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నతపాఠశాలలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ సునీత, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ కర్నాసుల విష్ణుమూర్తి, హెచ్‌ఎం ఎం.సాయిమోహన్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు. పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు తెలగాని వెంకట్రావు, పీడీ బీవీవీ ఎస్‌వీ ప్రసాద్ ప్రాణాయామం చేయించారు. నడకుదురులో యోగా గురువు లోవప్రసాద్, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శి పీఎస్‌వీఆర్ బ్రహ్మానందం, వైఎస్సార్ సీపీ నాయకుడు పైలా గోవిందులు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కరపలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, కార్యదర్శి వి.సునీల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు భోగిరెడ్డి సూర్యనారాయణ, కాదా వెంకటేశ్వరరావు, నక్కా సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్ యోగా డే నిర్వహించారు.

శిల్పారామంలో..

కాకినాడ రూరల్: స్థానిక బీచ్‌రోడ్డులోని శిల్పారామంలో అమ్మానాన్నల సేవా సంఘం ఆధ్వర్యంలో యోగా గురువు కృష్ణగోపాల్ లునాని యోగాలో శిక్షణ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, ప్రముఖ న్యాయవాది పెండెం శ్రీదేవి, వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా కో ఆర్డినేటర్ బండి శ్రీనివాసరావు, శిల్పారామం ఏఓ ప్రకాష్ పాల్గొన్నారు. ఎన్‌సీసీ గ్రూపు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ బీచ్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. 250 క్యాడెట్‌లు ఈ యోగాభ్యాసంలో పాల్గొన్నారు. గ్రూపు కమాండర్ కల్నల్ జీవిఎస్‌రావు, వింగ్ కమాండర్ డీఎస్ఎన్ మూర్తి, లెఫ్టినెంట్ కల్నల్ దుష్యంత్ పాల్గొన్నారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

బోట్‌క్లబ్: స్థానిక గైగోలుపాడు రోడ్డులోని బీ స్ట్రాంగ్ ఫిట్‌నెస్ సెంటర్‌లో బుధవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు వెదురుపాక సతీష్ హాజరై యోగా ప్రాచీన భారతదేశంలో ఉద్భవించిన శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసం అన్నారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ, యోగా శిక్షకులు రాము, బీస్ట్రాంగ్ ఫిట్‌నెస్ సెంటర్ అధినేత సంకీర్త్, అసోసియేషన్ సభ్యులు పద్మావతి, రఘురామ్, కల్యాణి, తన్మయి, సువర్ణ పాల్గొన్నారు.

ఆర్ఎంసీలో..

కాకినాడ క్రైం: కాకినాడ ఆర్ఎంసీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య విద్యార్థులు, బోధనకులు పాల్గొని నిపుణుల సూచనలతో యోగాసనాలు వేశారు. రంగరాయ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి సహా ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

పండగలా యోగా డే

కాకినాడ రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం మండలంలో పండగలా జరిగింది. పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం యోగా డే ఆవశ్యకతను తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్, డాక్టరు మాణిక్ రెడ్డి హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యోగా గురువు కె.మురళీకృష్ణ, యోగా ట్రైనర్ ఉషా క్రాంతి విద్యార్థులతో ఆసనాలు చేయించారు. పీజీ సెంటర్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.పోచయ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు శ్రీదేవి, నానిబాబు, మాణిక్‌రెడ్డి ఫౌండేషన్‌కు చెందిన మాణిక్‌రెడ్డి సత్యనారాయణ, తదితరులు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.



నడకుదురులో యోగాసనాలు వేస్తున్న పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు



నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్, మాణిక్ రెడ్డి హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగాసనాలు..



శిల్పారామంలో యోగసాధనలో..



యోగాసనాలు వేస్తున్న ఐడీఏ సభ్యులు



ఆసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

భూముల రీ-సర్వే పారదర్శకంగా చేయాలి

కార్పొరేషన్ కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: జగనన్న శాశ్వత భూహక్కు– భూ రక్ష పథకం కింద చేపట్టిన భూముల రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ అంశంపై అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ప్లానింగ్ కార్యదర్శులతో ఈ అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీఎంఏ నుంచి 16ఏ ఫార్మెట్‌లో వచ్చిన ఆదేశాల అమలుపై సూచనలు ఇచ్చారు. ఇందులో భాగంగా ఆయా అసెస్మెంట్ నెంబర్లు, ఇతర సమాచారాన్ని సర్వే నెంబర్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ సర్వే వల్ల ఎన్నో భూ వివాదాలకు, సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అర్బన్ రీసర్వే ప్రక్రియను అత్యంత ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, టౌన్ సర్వేయర్ ఆచారి, వార్డ్ సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల

ఎస్‌బీఐ సిబ్బంది రక్తదానం

బోట్‌క్లబ్: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో బుధవారం సిబ్బంది స్థానిక యూనియన్ కార్యాలయంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. దివంగత యూనియన్ నేత తారక్‌నాథ్ సంస్మరణార్థం రోటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఈ రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎస్‌బీఐ డివిజనల్ మేనేజర్ తపోధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహచర సిబ్బంది జ్ఞాపకార్థం స్వచ్ఛంద రక్తదానం చేయడం గొప్ప సామాజిక సేవ అని కొనియాడారు. బ్లడ్‌బ్యాంకు చైర్మన్ టీవీ బాలకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల నేతల జ్ఞాపకార్థం సామాజిక సేవ చేయాలన్న సంకల్పం ఉత్తమమైనదన్నారు. ఈ శిబిరంలో 36 మంది స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు పేరిశాస్త్రి, రీజనల్ సెక్రటరీ లక్ష్మీ, సభ్యులు రామ్‌కుమార్, దుర్గాభవానీ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సిబ్బందిని అభినందిస్తున్న ఎస్‌బీఐ డివిజనల్ మేనేజర్ తపోధన్

కటౌట్ తొలగింది

- సిగ్నల్ లైట్లకు విమోచనం
- ప్రయాణికులకు తప్పిన తిప్పలు





తొలగిన కటౌట్, కనిపిస్తున్న సిగ్నల్ లైట్లు

సాక్షి ఇంపాక్ట్

కాకినాడ క్రైం: జనసేన వారాహి యాత్ర సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు అనాలోచితంగా ఇష్టారీతిన బ్యానర్లు కట్టడంతో సామాన్యులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'సిగ్నల్ కప్పేస్తే వెళ్లేదెలా' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారుల్లో స్పందన వచ్చింది. స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో పూర్తిగా మూసేసిన ట్రాఫిక్ సిగ్నల్ లైట్లకు పోలీసులు విమోచనం కలిగించారు. ట్రాఫిక్ సిగ్నళ్లు కనిపించకుండా ఏర్పాటు చేసిన భారీ కటౌట్‌ను ఆగమేఘాల మీద తొలగించారు. దీంతో ప్రయాణికుల ట్రాఫిక్ ఇబ్బందులు తొలగాయి. ఈ కటౌట్ల వల్ల జనసేన నాయకులతో పాటు పోలీసులు సైతం ప్రజల విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాక్షిలో ప్రచురితమైన వార్తతో పోలీస్ యంత్రాంగం కదిలి తక్షణ చర్యలు తీసుకుంది.

ముందస్తు నారుమడులు వేయాలి

- జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయ్‌కుమార్
- గతం కంటే ఈ ఏడాది దిగుబడి పెరగాలి
- హైబ్రీడ్ వంగడాలను ఎంపిక చేసుకోవాలి

పిఠాపురం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి నుంచే నారుమడులు వేసుకునేలా రైతులను సన్నద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండలం కందరాడ రైతు భరోసా కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడులు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మేలైన అధిక దిగుబడులు వచ్చే హైబ్రీడ్ వంగడాలను ఎంపిక చేసుకునేలా రైతులకు సూచనలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ముందుగానే నారుమళ్లు వేసుకోవడం వల్ల పంట అక్టోబర్‌లో చేతికందే అవకాశం ఉంటుందని, తద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ ఏర్పడుతుందన్న విషయాన్ని రైతులకు వివరించాలన్నారు. ముందుగా నారుమళ్లు వేసుకోవడం వల్ల మూడు పంటలు పండే అవకాశం ఉందని రైతులకు వివరించాలన్నారు. ఆలస్యంగా నారుమళ్లు వేస్తే అధిక వర్షాలు, తుఫాన్లు వచ్చే సమయానికి పంట చివరి దశకు చేరుకుని నష్టాలు చవి చూడాల్సి వస్తుందన్న విషయాన్ని రైతులకు వివరించి త్వరగా నారుమళ్లు వేసుకునేలా చూడాలన్నారు.



ఈకేవైసీ విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయ్‌కుమార్

అలాగే రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. రైతు భరోసా కేంద్రాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి బిల్లులు లేకుండా ఏ దుకాణంలోను విత్తనాలు కొనుగోలు చేయరాదన్న విషయాన్ని వివరించి అలా చేయడం వల్ల నష్టం వస్తే పరిహారం రాదని రైతులకు తెలియజేయాలన్నారు. విత్తనాలు అధిక రేట్లకు విక్రయించకుండా పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి రైతు విత్తనశుద్ధి చేసేలా సూచనలు ఇవ్వడంతో పాటు కచ్చితంగా చేసేలా చూడాలన్నారు. సమీకృత వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల కలిగే లాభాలు రైతులకు వివరించాలని ఆయన సూచించారు. ప్రతి కౌలు రైతుకు సాగుహక్కు కార్డు పొందేలా తెలియజేసి అందరు పొందేలా చూడాలన్నారు. ఈనెల 25 లోపు పీఎం కిసాన్ సొమ్ము పడని అందరు రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పిఠాపురం వ్యవసాయశాఖ ఏడీఏ పి.స్వాతి, నియోజకవర్గ వ్యవసాయశాఖాధికారులు, ఆర్బీకే సిబ్బంది తదితరులున్నారు.

విత్తన ఎంపికే కీలకం

- నేల స్వభావాన్ని బట్టి సాగు చేయాలి
- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

కరప: ఖరీఫ్‌లో ప్రధాన సాగు వరి. ముందస్తు సాగుకు సమాయత్తపరచేందుకు ఈ నెల ఒకటినే కాలువలకు నీరొదిలినా, నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడం, అధిక ఉష్ణోగ్రతలతో సాగు ఆలస్యమైంది. రానున్న రెండు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు చెప్పడంతో సబ్ డివిజన్ పరిధిలో నారుమళ్ల తయారీకి రైతులు సమాయత్తమవుతున్నారు. భూ స్వభావాన్ని బట్టి వరి రకాలు సాగుచేసుకోవాలని, యాజమాన్య పద్ధతులు పాటిస్తే పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయాధికారి ఏవీ రాజేష్ రైతులకు సూచిస్తున్నారు.

ఖరీఫ్‌కు అనువైన రకాలు

- సాధారణ పరిస్థితులో నాటడానికి ఎంటీయూ–7029 (స్వర్ణ), ఎంటీయూ–1061(ఇంద్ర), ఎంటీయూ–1064(అమర), బీపీటీ–5204 (సాంబమసూరి), ఎంటీయు–1121 (శ్రీధృతి) రకాలు వాడవచ్చు. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ–1228 రకాన్ని కూడా వినియోగించుకోవచ్చు.
- విత్తనం ద్వారా వ్యాప్తిచెందే కొన్నిరకాల తెగుళ్ల నివారణకు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. అలాగే వరినాటే పద్ధతిలో ఒక ఎకరానికి 25 నుంచి 30 కిలోలు, వెదజల్లు పద్ధతిలో ఒక ఎకరానికి 12 కిలోల విత్తనాలు సరిపోతాయి.
- నారుమడిని సైతం పద్ధతిగా పెంచితే తెగుళ్ల సోకకుండా, వైపరీత్యాలు సంభవించినపుడు కుదుళ్లు బలహీనపడి పడిపోకుండా దృఢంగా నిలబడుతుంది.
- రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ సిబ్బందిని కలసి తగిన సలహాలు పొందాలని ఎంఏఓ రాజేష్ సూచిస్తున్నారు.



ఆర్బీకేలో విత్తనాలు కొనుగోలు చేసి తీసుకు వెళ్తున్న రైతు

విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకోవాలి

సామర్లకోట: విత్తన శుద్ధిపై అవగాహన పెంచుకోవడం ద్వారా దిగుబడి పెరగడానికి అవకాశం ఉంటుందని రిలయన్స్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ ఎస్.చిట్టిబాబు అన్నారు. బుధవారం వీకే రాయపురంలో జిల్లా వ్యవసాయశాఖ, రిలయన్స్ ఫౌండేషన్స్ సంయుక్తంగా విత్తన ఉత్పత్తి, విత్తన శుద్ధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విత్తన శుద్ధి చేసుకున్న విత్తనాలను పొలంలో చల్లుకోవడం వల్ల తొలిదశలో ఆశించే వేరుకుళ్ల తెగులు, అగ్గి తెగ్గులు, మాగుడు తెగులు పంట దరి చేరకుండా ఉంటాయన్నారు. అనంతరం రైతులకు విత్తనాలు అందజేశారు.

ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ విస్తరణాధికారి సతీష్ అధ్యక్షత వహించగా రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్.సుబ్రహ్మణ్యంనాయుడు, బర్రే నాగేశ్వర రావు, వీఏఏ జి.శ్రీలక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

సంగీతంతో మానసిక ప్రశాంతత

- రాయవరపు సత్యభామ
- ఉత్సాహంగా ప్రపంచ సంగీత దినోత్సవం

కాకినాడ కల్చరల్: సంగీతం మానసిక ప్రశాంతతను పెంపొందిస్తుందని రాయవరపు సత్యభామ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు ఆర్.సత్యభామ అన్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో కళావేదిక సౌజన్యంతో బుధవారం సాయంత్రం ప్రపంచ సంగీత దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సంగీతానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని సత్కళా వాహిని వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు అన్నారు. తదుపరి మంజరి సంగీత కళాశాల విద్యార్థులు చేసిన సంగీత కచేరి అలరించింది. అన్నమయ్య, త్యాగరాజు తదితర వాగ్గేయకారుల కృతులు ఆలపించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న, సంస్థ అధ్యక్షుడు గోపాల నర్సరాజు, తురగా సూర్యారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు రాయవరపు సత్యభామ తదితరులు